ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 8 సెప్టెంబరు 2025 | 5





కాకినాడ రూరల్ సూర్యారావుపేట సముద్రంలో వినాయక విగ్రహ నిమజ్జనం

చివరిరోజు నిమజ్జనాలు

గణపతి విగ్రహాల నిమజ్జనాలు చివరిరోజు ఆదివారం కూడా జరిగాయి. కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జనాలను యువత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు.

కళారంగాన్ని ఆదరిస్తున్న కాకినాడ ప్రజలు

» సినీ నటుడు తనికెళ్ల భరణి

7

అద్దేపల్లి రామ్మోహన రావు సాహిత్య పురస్కారం అందజేత

7



అన్నవరం సత్యదేవుడి ఆలయ తలుపులు మూసివేస్తున్న అర్చకులు, అధికారులు

7

చంద్ర గ్రహణ ప్రభావం
ఆలయాల మూసివేత

చంద్రగ్రహణ ప్రభావంతో ఆలయాలన్నీ ఆదివారం మూసివేశారు. అన్నవరం సత్యదేవుడు, సామర్లకోట భీమేశ్వరుడు, సర్పవరం భావనారాయణుడు సహా జిల్లాలో మిగిలిన ఆలయాలను మూసివేయగా సోమవారం సంప్రోక్షణ తర్వాత తెరవనున్నారు. పిఠాపురం పాదగయ క్షేత్రం మాత్రం తెరిచే ఉంది.



రేషన్ షాపులకు ఈ పోస్ మిషన్లు

» ఈపోస్ మిషన్లు మార్పు
» జిల్లాలో 2,857 డిపోలు
» త్వరలోనే కొత్త మిషన్లు

సామర్లకోట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రేషన్ అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా ఇటీవల రేషన్ కార్డులను స్మార్ట్‌గా చేసిన ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. రేషన్ డిపోల్లో ఇప్పటి వరకూ ఉన్న ఈ-పోస్ మిషన్లను ప్రభుత్వం మార్చుతోంది. కొత్త వాటిని అందించనుంది. అప్‌డేట్ వెర్షన్‌లతో కూడిన నూతన ఈ-పోస్ మిషన్లతో అక్టోబరు నెల రేషన్ సరుకులను పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే కొత్త మిషన్ల వినియోగంపై డీలర్లకు అవగాహన కల్పిస్తున్నారు. రేషన్ డిపోల్లో అక్రమాలను అరికట్టాలనే ఉద్దేశంతో 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ-పోస్ మిషన్లను తీసుకొచ్చింది. జీఎల్ 11 మోడల్‌కు చెందిన మిషన్లను అప్పట్లో అందించింది. పదేళ్ల తర్వాత వీటిని మార్చుతూ తిరిగి తెలుగుదేశం ప్రభుత్వంలోనే నూతన ఈ-పోస్ మిషన్లను మార్పులు చేస్తుండడం విశేషం. వీటికి 5జీ సపోర్టు ఉంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2,857 రేషన్ డిపోలున్నాయి. ఇవి జిల్లాల వారీగా చూస్తే కాకినాడ జిల్లాలో 1,060, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 926, తూర్పుగోదావరి జిల్లాలో 871 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటన్నింటికీ కొత్త ఈ-పోస్ మిషన్లను అందించేందుకు పౌరసరఫరాలశాఖ అన్ని సన్నాహాలు పూర్తి చేసింది.



కిట్టు.. నచ్చేట్టు!

వసతిగృహ విద్యార్థులకు కూటమిప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. కాస్మోటిక్ చార్జీ లు పెంచడంతోపాటు నగదుకు బదులుగా విద్యార్థులకు నాణ్యమైన వస్తువులతో కూడిన కిట్లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వచ్చే నెల నుంచి వీటిని విద్యార్థులకు అందజేయనున్నారు.

» హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ వస్తువుల అందజేత
» నగదు స్థానంలో కిట్ల పంపిణీ
» వచ్చే నెల నుంచి సరఫరా చేసేలా ప్రణాళికలు
» ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ ఉన్నతాధికారులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మొత్తం సాంఘికసంక్షేమశాఖ వసతిగృహాలు 33 కాగా వాటిలో 2,570మంది విద్యార్థులు ఉన్నారు. బీసీ వసతి గృహాలు 41 ఉన్నాయి. వీటిలో 4వేల మంది వరకు, ఆదర్శ పాఠశాలల విద్యార్థులు ఉన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు జిల్లాలో 9 ఉన్నాయి. వీటిలో 1200మంది వరకు విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ కాస్మోటిక్ కిట్లు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

కిట్లలో ఏముంటాయంటే..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాస్మోటిక్స్ చార్జీల కింద నగదు ఇస్తామని నెలలపాటు నిధులు విడుదల చేయకుండా వసతిగృహ విద్యార్థులను అప్పటి ప్రభుత్వం ఇబ్బందిపెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగదు స్థానంలో విద్యార్థులకు వస్తువులు అందజేయాలని నిర్ణయించింది. దీనిలోభాగంగానే సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థులకు కొబ్బరినూనె, టూత్ పేస్టు, షాంపు, స్నానపు సబ్బు, దుస్తులు ఉతుక్కునే సబ్బులు ఉంటాయి. విద్యార్థినులకు అదనంగా బొట్టు బిళ్లలు, పౌడర్, శానిటరీ ప్యాడ్స్. ఇలా రెండు నెలలకు సంబంధించిన సామగ్రిని ఒకేసారి ఇస్తారు. 3-6 తరగతుల విద్యార్థులకు గతంలో నెలకు రూ.100 చెల్లిస్తుండగా దాన్ని రూ.125కు పెంచారు. విద్యార్థినులకు రూ.110 నుంచి రూ.130కు పెంచారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.125 నుంచి రూ.150, విద్యార్థినులకు రూ.160 నుంచి రూ.200కి పెంచారు. కేజీబీవీల్లోని ఇంటర్ విద్యార్థులకు రూ.125 నుంచి రూ.200 వరకు, విద్యార్థినులకు రూ.160 నుంచి రూ.250 వరకు కాస్మోటిక్స్ చార్జీలు పెంచారు. ఇలా పెంచే మొత్తాలకు కాస్మోటిక్స్ కిట్లు అందజేయనున్నారు. బాలురు హెయిర్ కటింగ్‌కు రూ.30 ఇచ్చేవారు.. ప్రస్తుతం అది రూ.50కి పెంచారు.



భానుడి దెబ్బకు జనం విలవిల

భానుడి..భగపగ!

» కానరాని వరుణుడు
» మండుతున్న ఎండలు
» 10వ తేదీ వరకూ మంటలే
» మళ్లీ 12 నుంచి 18 వరకు..
» వాతావరణ శాఖ హెచ్చరిక

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఎండలు మండిపోతున్నాయి. వేసవిని తలపిస్తున్నాయి. వర్షాకాలంలో వానలు పడి.. చల్లగా ఉండాల్సిన వాతావరణం వేడెక్కిపోతోంది.ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఒక పక్క అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేస్తున్నా.. చినుకు జాడ కానరావడం లేదు. మరో వైపు సూర్యుడు మాత్రం తన ప్రతాపం చూపుతున్నాడు. ఇలాంటి సమయంలో బయటకు రావాలంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. ఏసీ ఉంటే తప్ప గదిలో ఉండలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉదయం 10 గంటల్లోపే జనం బయట పనులన్నీ పూర్తి చేసుకుని ఇంటి దారిపడుతున్నారు. అత్యవర పనులకు బయటకు వచ్చేవారు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుత వాతావరణం వేసవిని తలపించేలా ఉందని..అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నామని జిల్లా వాసులు అంటున్నారు.శుక్ర, శనివారాల్లో వాతావరణం మేఘావృతమై ఉంటుందని ఊహించినా..అందుకు విరుద్ధంగానే పరిస్థితులున్నాయి. ఆదివారం ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి.

పదో తేదీ వరకు నిప్పుల కొలిమే..

ఈ నెల ఐదో తేదీ వరకు వర్షాలు పడతాయని చెప్పిన వాతావరణశాఖ.. మరో పిడుగులాంటి వార్తను వినిపించింది. ఈ నెల పదో తేదీ వరకు వాతావరణం నిప్పుల కొలిమిని తలపిస్తుందని అంటున్నారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ నెల 12 నుంచి 18వ తేదీ మధ్యలో ఎండలు మరింత ముదురుతాయని చెబుతు న్నారు. వాస్తవానికి ఉష్ణోగ్రత సాధారణంగా 30 డిగ్రీలలోపు మాత్రమే ఉంటోంది. కానీ రెండు రోజులుగా 30నుంచి 35 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అసలే వాతావరణ మార్పులతో ప్రజలు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. జ్వరాల బారిన పడుతున్నారు. వర్షాలు పడాల్సిన సమయంలో తిరిగి ఎండలు విజృంభిం చడంతో ప్రజలు అల్లాడుతున్నారు. సమ్మర్ సీజన్ 2.0ను తలపించేలా ఉన్న ఈ పరిస్థితుల్లో ప్రజలు ఎండలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

» నిల్వలు అందుబాటులో ఉన్నాయి
» జిల్లా వ్యవసాయాధికారి

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. పిఠాపురం మండలం విరవ గ్రామంలో ఆయన ఆదివారం సాయంత్రం పర్యటించారు. రైతులతో మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాలకు సోమవారం 80మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని చెప్పారు. యూరియా ఎక్కువగా వినియోగించడంవల్ల పురుగులు, తెగుళ్ల బెడద పెరుగుతుందని తెలిపారు. రైతులు మూడోవిడతగా 10-15కిలోల పొటాష్ వినియోగిస్తే వరి పంటకు తెగుళ్ల తట్టుకునే శక్తి వస్తుందని, గింజ నాణ్యత పెరుగుతుందని తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, ఏవో గంగాధర్ తదితరులు ఉన్నారు.



పిఠాపురం మండలం విరవలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్

అప్రమత్తత అవసరమే..

» పశువులు, జీవాల పట్ల అశ్రద్ధ వద్దు
» ప్రస్తుతం వ్యాధులు వ్యాప్తి చెందే కాలం
» లక్షణాలు కనబడితే పశువైద్యులను సంప్రదించాలి

7



ఏలూరు నుంచి ప్రత్తిపాడు వస్తున్న పెరుమళ్లరాజు కాలువ చెక్‌డ్యామ్ ఏర్పాటుతో ప్రత్తిపాడు చెరువుకు వచ్చే బంద్ అయిన సాగునీరు

కాలువపై చెక్‌డ్యామ్

» మూడు చెరువులకు అందని సాగునీరు
» చెక్‌డ్యామ్ తొలగించాలని కోరుతున్న రైతులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు గ్రామంలోని మూడు చెరువులకు సజావుగా నీరందకుండా చెక్‌డ్యామ్ అడ్డుపడింది. దీంతో చెరువుల్లోకి నీరు రాక చెరువు ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు వెంకటపతిరాజు చెరువు నుంచి పెరుమళ్లరాజు కాలువ ద్వారా ప్రత్తిపాడులోని ఊరచెరువు, సిద్దావారి చెరువు, దేవులాపల్లి వారి చెరువులకు నీటి సరఫరా ఉండేది. పెరుమళ్లరాజుకాలువపై నరేంద్రగిరికొండ జాతీయ రహదారి సమీపంలో 150మీటర్ల దూరంలో నూతనంగా చెక్‌డ్యామ్ ఏర్పాటు చేశారు. దీనివల్ల పెరుమళ్లరాజు కాలువనుంచి నేరుగా ఊరచెరువులోకి నీటి సరఫరా జరగకుండా అవరోధంగా మారింది. చెక్‌డ్యామ్ అడ్డుకట్టగా ఉండడంతో నీరు వెనక్కి మళ్లి సమీప పంట పొలాల మీదుగా సుద్దగడ్డ వాగులోకి తరలిపోతోంది. దీంతో ఊరచెరువుకు నీరు రాక సిద్దావారి చెరువు, దేవులపల్లివారి చెరువులకు నీరు సరఫరా జరగడంలేదు. దీంతో ఈ మూడు చెరువుల ఆయకట్టు పరిధిలోని వెయ్యి ఎకరాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం అధికారులు ఈ చెక్‌డ్యామ్‌ను తొలగించి చెరువుల్లోకి సజావుగా నీరు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

సైబర్ ఆటకట్టించే ఈకేవైసీ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

బ్యాంకు ఖాతాదారులను టార్గెట్ చేస్తూ.. సైబర్ మోసాలకు పాల్పడేవారి సంఖ్య ఇటీవల కాలంలో పెరిగింది. ఆర్థిక నేరాల అడ్డుకట్టకు, సైబర్ నేరగాళ్ల బారి నుంచి ఖాతాదారులను కాపాడుకోవడానికి ఆర్బీఐ సంకల్పించింది. ఇందులో భాగంగా అన్ని జాతీయ ప్రైవేటు బ్యాంకుల్లో ఖాతాదారులకు ఈకేవైసీ(ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) తప్పనిసరి చేసింది. మోసాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేస్తోంది. ఏదైనా బ్యాంకులో అకౌంట్ తెరిచాక ఏడాది పాటు ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరపకుంటే నిలిచిపోతుంది. ఇలాంటి ఖాతాల వివరాలను సైబర్ నేరగాళ్లు సేకరించి, సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఖాతాదారులు ఈకేవైసీ చేయించుకోవడం ద్వారా సైబర్ నేరాలను నివారించవచ్చు అంటూ ఇటీవల కాకినాడ వచ్చిన ఆర్‌బీఐ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ఖాతాదారులతో సమావేశమై వారికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఫీల్డ్ లెవెల్ ఫైనాన్షియల్ లిటరసీ ఈవెంట్(ఎఫ్ఎల్ఎఫ్ఎల్ఈ)ను నిర్వహించి డిజిటల్ లావాదేవీల విషయంలో అప్రమత్తత అవసరమని, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు.



» ఈకేవైసీతోనే భద్రత
» బ్యాంకు ఖాతాలకు తప్పనిసరి
» హెచ్చరిస్తున్న ఆర్‌బీఐ

35 లక్షల ఖాతాలు..

జిల్లాలో మొత్తం 35,37,600మంది బ్యాంకు ఖాతాదారులు ఉన్నారు.వీరిలో 4,86,270 మంది ఖాతాదారులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. జూలై 1 నుంచి ఇప్పటి వరకు 84,142 ఖాతాలకు ఈకేవైసీ పూర్తయింది. ఇటీవల జిల్లాలోని పలు బ్యాంకుల్లో ఖాతాదారుల వ్యక్తిగత, సంయుక్త ఖాతాలు అధిక సంఖ్యలో నిలిచిపోతున్నాయి. ఒకేసారి ఎక్కువ సంఖ్యలో బ్యాంకులకు వెళుతుండడంతో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఫలితంగా ఖాతాల పునరుద్ధరణలో జాప్యం నెలకొంటోంది. ఖాతాదారులు అసహనానికి గురవుతున్నారు. ఖాతా నిర్వహణ సక్రమంగా ఉంటే ఇబ్బందులు ఉండవు.

ఈకేవైసీ చేయించుకోండిలా..

ఇటీవల కాలంలో బ్యాంకు ఖాతాల వినియోగం అధికమైంది. వ్యక్తిగత ఖాతాలతో పాటు, శాలరీ అకౌంట్, ఏదైనా లోన్లకు సంబంధించి మరో బ్యాంకులో ఇలా రకరకాల బ్యాంకుల్లో ఖాతాలు తెరిచేవారు అధికమయ్యారు. ఇలాంటి ఖాతాదారులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. మొదటి రకం.. సాధారణ ఖాతాదారులు పదేళ్లకోసారి,రెండో రకం.. మధ్యస్తంగా ఉన్న వారు ఐదేళ్ల కోసారి, మూడో రకం... హైరిస్క్ ఖాతాదారులు రెండేళ్లకోసారి ఈకేవైసీ చేయించుకోవాలి.

బ్యాంకు ఖాతా నిలిచిపోతే ఆందోళన వద్దు..

ఎవరికైనా బ్యాంకు ఖాతా నిలిచిపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆధార్, పాన్ కార్డు నకళ్ల బ్యాంకు సిబ్బందికి అందజేస్తే సరిపోతుంది. ఏడాదిలో కనీసం ఒక్కసారైనా ఖాతా ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలి. లేదంటే మీ ఖాతా మురిగిపోతోంది. ఖాతా నిర్వహణ అనేది సక్రమంగా జరగాలి.

- సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్, కాకినాడ జిల్లా

జిల్లాలో ప్రశాంతంగా ఫారెస్ట్ రిక్రూట్‌మెంట్ పరీక్షలు: డీఆర్‌వో వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఫారెస్ట్ రిక్రూట్మెంట్ ఆఫీసర్ల పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లావ్యాప్తంగా పరీక్షలు నిర్వహించారన్నారు. జిల్లాలోని 26 పరీక్షాకేంద్రాల్లో 18వేలమంది అభ్యర్థులకుగాను 15,153 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు.ఉదయం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ల పరీక్షలకు 15,447మంది అభ్యర్థులకుగాను 13,330మంది హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగిన ఫారెస్ట్‌సెక్షన్ ఆఫీసర్ పరీక్షలకు 2283మంది అభ్యర్థులకుగాను 1823మంది హాజరయ్యారని తెలిపారు. కాకినాడలో పరీక్ష కేంద్రాలను ఆర్డీవో మల్లిబాబు,తహసీల్దార్ జితేంద్ర పరిశీలించారు.



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో మల్లిబాబు

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన వెలువరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరుకావాలన్నారు. పీజీఆర్ఎస్‌కు హాజరుకాలేని అభ్యర్థులు మీకోసం వెబ్‌సైట్‌లో అర్జీలను నమోదు చేసుకోవాలన్నారు.

10 నుంచి ఈశా ఆధ్వర్యంలో యోగా తరగతులు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 10వతేదీనుంచి 16 వరకు ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ రామకృష్ణారావుపేటలో ఉన్న గాంధీభవన్‌లో ఇన్నర్ ఇంజినీరింగ్ యోగాతరగతులు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. సద్గురు జగ్గీవాసుదేవ్ సమక్షంలో వారంరోజుల పాటు యోగా తరగతులు జరుగుతాయన్నారు. హాజరయ్యేవారు 9618118529, 6301756244 నెంబర్లలో సంప్రదించాలన్నారు.రిజిస్ట్రేషన్‌ను isha.co/iekkd నమోదు చేసుకోవాలన్నారు. శక్తివంతమైన శాంభవి మహాముద్ర క్రియ జరుగుతుందన్నారు. శిక్షణా తరగతులు రెండు సెషన్లలో జరుగుతాయన్నారు. ఉదయం 6 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు, సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతాయన్నారు.

అప్రమత్తత అవసరమే..

- పశువులు, జీవాల పట్ల అశ్రద్ధ వద్దు
- ప్రస్తుతం వ్యాధులు వ్యాప్తి చెందే కాలం
- లక్షణాలు కనబడితే పశువైద్యులను సంప్రదించాలి


పశువుకు ముద్ద చర్మ వ్యాధి సోకిన దృశ్యం (ఫైల్)

కాకినాడ క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పశువులు(గేదెలు, ఆవులు), జీవాలు(మేకలు, గొర్రెలు)ను పెంచే పెంపకందార్లు వాటిని చంటి పిల్లలు మాదిరిగా చూసుకుంటారు. ప్రస్తుతం వర్షాకాలంలో పశువులకు అనేక రకాల వ్యాధులు సోకుతాయి. అప్పటివరకు ఎండతో మరిగి ఉన్న నేల వర్షపు నీరు, వరదలతో తడిసి వరదలు తగ్గుముఖం పట్టాక మురుగు నీరు ఇంకి, వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. నేల చిత్తడిగా మారినప్పుడు అనేక రోగాలు సంక్రమిస్తాయి. ఒక్కోసారి మూగజీవాలకు సంక్రమించేవి సాధారణ వ్యాధులు అయినా అప్రమత్తతతో కూడిన సంరక్షణ చర్యలు తీసుకోకపోతే వ్యాధి తీవ్రతరమై పశువు మరణించి పాడిరైతు నష్టపోయే అవకాశం ఉంటుంది. అందువల్ల పశువుల ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వెటర్నరీ వైద్యులు సూచిస్తున్నారు.

వచ్చే వ్యాధులు...

వర్షాకాలంలో పశువులకు గొంతు వాపు వ్యాధి, ముద్ద చర్మ వ్యాధి, జబ్బ వాపు వ్యాధి, గాలి కుంటు వ్యాధి, జలగ వ్యాధి జీవాలకు నీలి నాలుక వ్యాధి, కాలి పుండు వ్యాధులు సంక్రమించడానికి ఎక్కువగా అవకాశాలున్నాయి. గొంతు వాపు వ్యాధిలో గొంతు కింది భాగంలో జలవాపు ప్రారంభమై క్రమంగా మెడ కింది భాగానికి అనంతరం రొమ్ము భాగానికి చేరి ఆయాసంతో కూడిన గురక వచ్చి నోరు, ముక్కు నుంచి నురగ కారుస్తుంది. ఈ లక్షణం కనబడిన వెంటనే వైద్యచికిత్స అందకపోతే పశువు మరణిస్తుంది. ముద్ద చర్మ వ్యాధిలో తీవ్ర జ్వరంతోపాటు చర్మం కింద కణుతులు వచ్చి కళ్ళ, ముక్కు నుంచి నీరు కారుతుంది. దూడల్లో వ్యాధి తీవ్రత ఎక్కువైతే చనిపోయే అవకాశాలు ఎక్కువ. జబ్బవాపు వ్యాధి సోకిన పశువులకు జ్వర తీవ్రత ఎక్కువగా ఉండి శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. కండరాలవాపు, ఆ ప్రదేశంలో చర్మం కమిలి వెచ్చగా, నొప్పిగా ఉంటుంది. చేత్తో ఒత్తిడి కలిగించినప్పుడు గాలి బుడగల శబ్దం వినిపిస్తుంది. గాలికుంటు వ్యాధిలో జ్వరంతోపాటు నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేకపోవడం వల్ల నీరసపడిపోవడంతో పాల దిగిబడి, పునరుత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుంది. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న దూడలు మరణించే అవకాశాలు ఎక్కువ. జీవాల్లో అయితే నీలి నాలుక వ్యాధితో నోటిలో అధికంగా పుండ్లు ఏర్పడతాయి. ఈ వ్యాధి వల్ల గిట్టల మధ్య వాపు వచ్చి చర్మం ఎర్రగా మారి క్రమంగా పగుళ్లు ఏర్పడతాయి. జ్వరం, నొప్పి వల్ల సరిగా నడవలేక ఆహారం తీసుకోవడం కష్టతరమవుతుంది.


మేకకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ డాక్టర్ (ఫైల్)

ఉచితంగా టీకాలు...

ఈ వ్యాధులకు నివారణా చర్యగా జిల్లా పశుసంవర్ధకశాఖ ఏడాదికి రెండుసార్లు రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా టీకాలు సరఫరా చేస్తుంది. జిల్లాలోని పశువైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల్లో ఈ టీకాలు అందుబాటులో ఉంటాయి. గొంతువాపు, జబ్బవాపు వ్యాధులకు ఏప్రిల్, నవంబర్ నెలలో, గాలి కుంటువ్యాధికి సెప్టెంబర్, ఫిబ్రవరి నెలలో ముద్ద చర్మ వ్యాధి, నీలి నాలుక వ్యాధులకు జూన్, జూలై నెలల్లో పశువైద్యసిబ్బంది టీకాలు వేస్తారు. ఈ టీకాలు వ్యాధి పొడుగునా పశువైద్యకేంద్రాల్లో అందుబాటులో ఉంటాయి. రైతులు ఈ సేవలను వినియోగించుకుని నష్టాలను నివారించుకోవచ్చు.

ముందస్తు జాగ్రత్త చర్యలు తప్పనిసరి

సీజనల్ వ్యాధులను నివారించేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా పాటించాలి. పశువుల పాకల చుట్టూ దోమ తెరలు ఏర్పాటు చేసుకోవాలి. ఆయా పరిసర ప్రాంతాల్లో పొడిగా నీళ్లు నిల్వకుండా చూసుకోవాలి. పశువుల షెడ్లలో దోమల బెడద ఎక్కువగా ఉన్నప్పుడు వాటిని నియంత్రించేందుకు సాయంత్రం సమయాల్లో పచ్చి వేపాకు పొగ పెట్టడం ద్వారా చాలావరకు ఆ సమస్యను నియంత్రించవచ్చు. పశువులు వర్షంలో తడవకుండా షెడ్లలో ఉంచడం, ఎత్తైన ప్రదేశాల్లో ఉంచడం, కలుషిత నీరు తాగకుండా జాగ్రత్తలు తీసుకోవడం, పశువులశాలలు పరిశుభ్రంగా ఉంచడం వ్యాధి బారినపడిన పశువులను ఆరోగ్యంగా ఉన్న పశువుల నుంచి వేరు చేయడం, అనారోగ్యంతో ఉన్న పశువులకు సకాలంలో వైద్యచికిత్స అందించేలా చర్యలు తీసుకోవడం వంటి ముందస్తు జాగ్రత్త తీసుకుంటే పశువులు, జీవాలు వ్యాధుల బారిన పడకుండా ఉండడమే కాకుండా రైతులు కూడా నష్టపోకుండా ఉంటారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న పశువైద్యశాలల్లో టీకాలతోపాటు పశువులు, జీవాలకు కావాల్సిన మందులు సమృద్ధిగా ఉన్నాయి.

డాక్టర్ వై.కృష్ణజ్యోతి, డీడీ, పశుసంవర్ధకశాఖ, కాకినాడ జిల్లా

తెలియని రోగం... తెగ ఇబ్బంది!

- లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల ప్రజల అవస్థలు
- జ్వరం, కీళ్ల, నడుం నొప్పులతో సతమతం


లబ్బర్తి గ్రామంలో మంచం పట్టిన యువతి

రాజవొమ్మంగి సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలో తెలియని రోగంతో మూడు గ్రామాల ప్రజలు మంచం పట్టారు. మండలంలోని లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల ప్రజలు గత 2 నెలలుగా అనారోగ్యంతో ఆసుపత్రులకు రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. 3 గ్రామాల్లో ప్రజలకు ఒకే రీతిగా.. జ్వరం రావడం ఆసుపత్రికి వెళ్లి మందులు వాడిన తరువాత జ్వరం తగ్గుముఖం పట్టి, కీళ్ల నొప్పులు, నడుం పట్టేసి మంచంపై నుంచి సైతం లెగలేకుండా ఉంటున్నారు. నిత్యం పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్లు వేసుకుంటే తప్ప కాలకృత్యాలు కూడ తీర్చుకోలేని పరిస్థితి. ఈ గ్రామాల ప్రజలు లాగరాయి ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు వాడిన పనిచేయలేదని, మైదాన ప్రాంతాలలో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నామని వాపోయారు. దీనిపై రాజవొమ్మంగి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి మాట్లడుతూ గతంలో దీనిపై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడంతో డీఎంహెచ్‌వోని పంపాగా రోగులను పరిశీలించి బ్లడ్ శాంపిల్స్‌ను ల్యాబ్‌కి పంపినా అధికారులు నేటికి ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ప్రజలు మృత్యువాత పడితే కాని స్పందించరా అని ఎంపీపీ ప్రశ్నించారు. అయితే పారిశుధ్య లోపమా, నీటి కాలుష్యమా, వైద్యులు పట్టించుకోని వైనమా తెలియదు కాని ఉన్నతాధికారులు తక్షణం స్పందించి గ్రామాల్లో తాము పడుతున్న అనారోగ్య సమస్యలపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కింద్ర గ్రామంలో రామాలయ ఆరుబయట జారబడ్డ జనం

గ్రహణం వేళ తెరిచి ఉన్న పాదగయ


తెరిచి ఉన్న కుక్కుటేశ్వరస్వామి ఆలయం

కుక్కుటేశునికి అభిషేకాలు

పిఠాపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం సమయంలో కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రం తెరిచే ఉంది. గ్రహణ సమయంలో రాష్ట్రంలోని అన్ని ఆలయాలను మూసివేసినా పాదగయతో పాటు శ్రీకాళహస్తి ఆలయాలు మాత్రమే తెరిచి ఉంటాయి. ప్రాచీన కాలం నుంచి వస్తున్న సంప్రదాయాలకు అనుగుణంగా గ్రహణ సమయంలో కుక్కుటేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. బ్రాహ్మణులు, అర్చకులు, పురోహితులు పాదగయ పుష్కరిణిలో పట్టువిడుపు స్నానాలు ఆచరించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి ఆలయంతో పాటు అన్ని ఆలయాలు తెరిచే ఉన్నాయి. పూజల్లో ఆలయ ఈవో కట్నం జగన్మోహన శ్రీనివాస్ తదితరులున్నారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లి.. చెరువులో శవంగా తేలి!

దుర్గాడలో యువకుడి మృతి


వెంకటేష్ (ఫైల్)

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు చెరువులో శవమై తేలి కనిపించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన బొమ్మిడి వెంకటేష్(25) ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం భోజనం చేసి ఇంటి నుంచి బయటకువెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. ఆదివారం గ్రామంలోని కొత్త చెరువులో వెంకటేష్ మృతదేహం ఉండడాన్ని గ్రామస్తులు గుర్తించారు. అతడు బహిర్భూమికి వెళ్లి జారిపడి మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. అతడికి భార్య, కూతూరు ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించే వెంకటేష్ మరణించడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మెన్ మృతి


నాగార్జున (ఫైల్)

ఎటపాక, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మెన్ మృతిచెందిన ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం వెంకటరెడ్డిపేట గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గుండాల గ్రామ సచివాలయంలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న ముర్రం నాగార్జున (35) మరో లైన్‌మెన్ శంకర్‌తో కలిసి ఆదివారం మధ్యాహ్నం వెంకటరెడ్డిపేట గ్రామం వెళ్లారు. ఎల్‌టీ విద్యుల్ లైన్‌పై చెట్టు కొమ్మలు విరిగిపడి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని సమాచారం ఇవ్వడంతో ఇద్దరు పరిశీలించారు. విద్యుత్ సరఫరా నిలిపి వేసి లైన్‌పై చెట్ల కొమ్మలు తొలగించే క్రమంలో విద్యుత్ సరఫరా జరగడంతో నాగార్జున, శంకర్ విద్యుత్ షాక్‌కు గురయ్యారు. దీంతో నాగార్జున అపస్మారక స్థితికి వెళ్లడంతో వెంటనే భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కాగా నాగార్జున స్వగ్రామం ఎటపాక మండలం బొజ్జిగుప్ప గ్రామం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళారంగాన్ని ఆదరిస్తున్న కాకినాడ ప్రజలు

సినీ నటుడు తనికెళ్ల భరణి


జీవన సాఫల్యం పురస్కారం అందుకుంటున్న తనికెళ్ల భరణి

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు కాకముందు సుమారు 45 ఏళ్ల క్రితం కాకినాడలో నాటకం రాశానని, అప్పుడు ప్రజలు నాటక, కళారంగాన్ని ఎలా ఆదరించారో నేటికి అలాగే ఆదరాభిమానాలు చూపించడం తనను మంత్రముగ్ధున్ని చేసిందని నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణి అన్నారు. దంటు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, దియంగ్మెన్స్ హ్యాపీక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమెరికామెడీ కథలు నాటికల ప్రదర్శనలో భాగంగా తనికెళ్ల భరణికి జీవన సాఫల్యం పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు చప్పట్లు మాత్రమే కోరుకుంటారని, ఇక్కడ హాలు నిండుగా ఉన్న జనాన్ని చూస్తుంటే ఎనలేని ఆనందంగా ఉందన్నారు. సుమారు వందేళ్లకు పైబడి నాటక రంగానికి దియంగ్మెన్స్ హ్యాపీ క్లబ్, దంటు కుటుంబీకులు చేస్తున్న సేవలు నిరుపమానమన్నారు. అమెరికాలో ఉంటూనే తెలుగు సాహిత్యం, భాష, కళలల పట్ల మక్కువతో వంగూరి చిట్టెన్ రాజు ఎంతో పాటుపడుతున్నారన్నారు. చిట్టెన్ రాజు మాట్లాడుతూ తనికెళ్ల భరణి నటుడిగా, సాహితీవేత్తగా తనకంటూ ప్రత్యేక ముద్రను వేసుకున్నారని ఆయనకు పురస్కారం అందజేయడం ఆనందంగా ఉందన్నారు. బామ్మాయణం, సన్యాసీ నవ్వాడు, భార్య బాధితుల సంఘం నాటికలు ఆద్యంతం నవ్విస్తూ ఆలోచింపజేశాయి. యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు సూర్యారావు, కార్యదర్శి నాదెళ్ల ప్రభుదాసు, మార్ని జానకిరామ్ చౌదరి, కృష్ణారావు, సుచిత్రమూర్తి పాల్గొన్నారు.

చంద్రగ్రహణం ఎఫెక్ట్

ఆలయాలు మూసివేత


అన్నవరంలో...

అన్నవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యదేవుడి ఆలయం తలుపులు ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు మూసివేశారు. ఉదయం 10గంటలకు వ్రతం టిక్కెట్ల విక్రయాలు నిలుపుదల చేశారు. ప్రధానాలయంతో పాటుగా తూర్పురాజగోపురం, పశ్చిమ రాజగోపుర తలుపులకు కవాటబందనం గావించారు. గ్రహణం అనంతరం సోమవారం ఉదయం ఆలయాన్ని సంప్రోక్షణ గావించి ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభమవుతాయని ఈవో సుబ్బారావు తెలిపారు. కవాటబందనం కార్యక్రమంలో ఈవోతో పాటుగా ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఏఈవో భాస్కర్ ఉన్నారు.

అంతర్వేదిలో...

అంతర్వేది, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఆలయాన్ని మూసివేసినట్ల ఆలయ సహాయ కమిషనర్ ఎం.ప్రసాద్ తెలిపారు.


అంతర్వేదిలో ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు, అధికారులు


సామర్లకోట భీమేశ్వరాలయ తలుపులు మూసివేసిన దృశ్యం


ద్రాక్షారామలో భీమేశ్వరాలయ ప్రధాన ద్వారం మూసివేస్తున్న అర్చకస్వామి

సామర్లకోటలో...

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో పంచారామ పుణ్యక్షేత్రమైన కుమారారామ భీమేశ్వరాలయం తలుపులను ఆదివారం మధ్యాహ్నం దేవాదాయ అధికారుల సమక్షంలో ఆలయ పండితులు మూ సివేశారు. గ్రహణం విడుపు అనంతరం సోమ వారం

సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. నిత్యం జరిగే ఆర్జిత అభిషేకాలు రద్దు చేసి ఉదయం 10గంటలకు సుదర్శన హోమం నిర్వహిస్తామన్నారు.

ఉదయం ఆలయ ఆవరణ అంతా సంప్రో క్షణ చర్యల తర్వాత స్వామి,అమ్మవార్లకు నిత్యపూజలు ప్రారంభించి దర్శనాలకు భక్తులకు అనుమతిస్తామని ఈవో నీలకంఠం తెలిపారు.

ద్రాక్షారామలో...

ద్రాక్షారామ (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని మూసివేశారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు స్వామికి మహానివేదన సమర్పించారు. అనంతరం ఆలయం తలుపులు మూసివేశారు. సోమవారం ఉదయం మహాసంప్రోక్షణ అనంతరం 7.30 గంటలకు ఆలయం తెరుస్తామని, భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని ఆలయ సహాయ కమీషనరు అల్లు వెంకట దుర్గాభవానీ తెలిపారు.

వాడపల్లిలో...

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు ఆలయ అర్చకులు మూసివేశారు. సోమవారం ఉదయం 7 గంటలకు ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ పూజల అనంతరం భక్తులకు దర్శనాలు అనుమతి ఇస్తామని ఆలయ ఉపకమిషనరు సూర్యచక్రధరరావు తెలిపారు.


వాడపల్లిలో తాళాలు వేస్తున్న అర్చకులు

'జయలక్ష్మి' బాధితులకు సత్వర న్యాయం చేయాలి

తక్షణం మహాజన సభ ఏర్పాటు చేయాలి

బాధితుల సంఘం డిమాండ్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయల ఆర్థిక మోసానికి పాల్పడిన నిందితులపై చర్యలు, సీబీసీఐడీ సీజ్ చేసిన ఆస్తులు కోర్టు ద్వారా సొసైటీకి వచ్చేలా చర్యలు తీసుకోవడంలో జయలక్ష్మి సొసైటీ పాలకవర్గం వైఫల్యం చెందింది. ఆర్థిక లావాదేవీల కార్యకలాపాల్లో పారదర్శకత లోపించడంతో సుమారు రూ.3.7కోట్ల అవకతవకలు జరిగాయి. బాధితులకు సత్వర న్యాయం చేయాలని, తక్షణం మహాజన సభ ఏర్పాటు చేయాలని ది జయలక్ష్మి ఎంఏఎం సొసైటీ లిమిటెడ్ డిపాజిటర్స్ బాధితుల సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం కాకినాడ విద్యుత్నగర్‌లోని చల్లా కల్యాణ మండపంలో బాధితుల సంఘం కార్యదర్శి పిల్లి గణేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, కస్తూరి రవికుమార్, టీవీడీఎన్‌వీపీ రావు, జీవీవీ రెడ్డి, రాజగోపాల్ మాట్లాడారు. ప్రస్తుత బోర్డు పనితీరు సక్రమంగా లేదని, రుణాల వసూళ్లు, బ్యాంకు డిపాజిట్లలో అవకతవకలు జరిగాయని విమర్శించారు. రుణం తీసుకున్న వ్యక్తుల నుంచి పూర్తిస్థాయిలో డబ్బులు రికవరీ చేయకుండా డాక్యుమెంట్లు వెనక్కి ఇచ్చేశారని, దీని వల్ల సొసైటీకి సుమారు రూ.3.7కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు ఇటీవల అధికారుల విచారణలో తేటతెల్లమైందన్నారు. ఏపీఎంఏసీఎస్ యాక్ట్ 21 మేరకు చైర్మన్, మరో నలుగురు డైరెక్టర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు బాధ్యులుగా రిపోర్టులో పేర్కొన్నారు. 'నిందితులు, లోన్ తీసుకున్న వారి ఆస్తులు సీజ్ చేయించాం... కోర్టుల్లో ఉన్నాయి... నిందితులపై కేసులు, చార్జిషీట్లు వేయిస్తున్నా'మని కబుర్లు చెప్పడం తప్పించి ఎటువంటి ఫలితం కనిపించట్లేదన్నారు. సొసైటీ ఏర్పాటై సుమారు మూడేళ్లు కావచ్చినా బాధితులకు నేటికీ ఏ న్యాయం జరగలేదన్నారు. బాధితుల్లో సుమారు 80మందికి పైగా చనిపోయారన్నారు. ప్రస్తుత బోర్డు సభ్యులు అనుసరిస్తున్న చర్యలపై సభ్యులు అసంతృప్తితో ఉన్నారని, తక్షణం మహాజన సభ ఏర్పాటు చేసి బోర్డులో మార్పులు, చేర్పులు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో సొసైటీ నిర్వహణ కోసం బాధితులంతా కలసి చైర్మన్‌కు రూ.లక్ష చెక్కు ఇచ్చామని, తక్షణం వడ్డీతో సహా వెనక్కి ఇవ్వాలని, బాధిత సంఘంలో సభ్యుల మార్పులు, చేర్పులు చేపట్టాలన్నారు. అవసరమైతే ఈ మేరకు క్రిమినల్ కేసులు వేయడం, ప్రభుత్వ జోక్యంతో పాత కమిటీని రద్దుచేసి నూతన పాలకవర్గాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సభ్యులు తీర్మానించారు. సమావేశంలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంలకు చెందిన సుమారు 150 మంది సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి సొసైటీ బాధితుల సంఘం ప్రతినిధులు

'అద్దేపల్లి అభిప్రాయం ధృడం'


రెంటాల దంపతులకు అద్దేపల్లి పురస్కారం అందజేస్తున్న అతిథులు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అద్దేపల్లి రామమోహనరావు ముక్కుసూటిగా, ధృడమైన అభిప్రాయాలు కలిగి ఉండే వారని, ఆయన రచనల్లోనూ అది ప్రస్ఫుటిస్తుందని వక్తలు పేర్కొన్నారు. ప్రజాకవి అద్దేపల్లి రామమోహనరావు సాహిత్య పురస్కారం 2025 ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి కల్పనా సెంటర్లోని రోటరీ హాల్లో నిర్వహించారు. అద్దేపల్లి రామ్మోహనరావు సాహిత్య పురస్కార వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అద్దెపల్లి ఉదయ భాస్కరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజమహేంద్రవరానికి చెందిన ఎస్ఆర్.పృథ్వీ మాట్లాడుతూ వయోబేధం లేకుండా ప్రతీ ఒక్కరినీ సాహిత్యంలో ప్రోత్సహించిన గొప్ప సాహితీవేత్త అద్దేపల్లిగా పేర్కొన్నారు. మధునాపంతుల సత్యనారాయణ మాట్లాడుతూ అద్దేపల్లి ఆధునిక కవిత్వం వైపు వచ్చి అనేక రచనలు చేశారన్నారు. ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ తన సాహిత్యంలో దాన్ని ప్రతిధ్వనింపజేశారన్నారు. పురస్కార గ్రహీత రెంటాల శ్రీవేంకటేశ్వరరావు మాట్లాడుతూ గజల్స్ పాడిన వారిలో అర్థవంతంగా పాడి కొత్త వరవడికి అద్దేపల్లి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం అతిథులు రెంటాల దంపతులకు అద్దేపల్లి రామ్మోహనరావు సాహిత్య పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. వచన కవిత పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో అద్దేపల్లి రాధాకృష్ణ, అద్దే పల్లి ప్రభు, వాడ్రేవు వీరలక్ష్మిదేవి, గౌరినాయుడు, గనారా, సాహితీ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

దళితుడిపై దాడి

అట్రాసిటీ కేసు నమోదు


గాయాలు చూపుతున్న వెంకటేష్

ఎటపాక, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దళితుడిని దూషిస్తూ కర్రతో దాడిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ అప్పల రాజు తెలిపారు. వివరాల ప్రకారం.. అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట గ్రామానికి చెందిన పశువుల కాపరి గవ్వల వెంకటేష్ రోజు మాదిరిగానే గెదేలను మేపడానికి వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన జంగాల సాయిబాబు తన గెదే, లేగదూడను తొలుకెళ్లే వియషంలో ఇద్దరి మధ్య వివాదం జరిగింది. ఈ క్రమంలో వెంకటేష్ గెదేలతో సాయంత్రం ఇంటికి తిరికొస్తుండగా అతడిని సాయిబాబు కులం పేరుతో దూషించడంతోపాటు దుర్భాషలాడుతూ కర్రతో దాడి చేశాడు. దీంతో తల, చేతిపై గాయాలయ్యాయి. బాధితుడు ఫిర్యాదు మేరకు సాయిబాబుపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్‌ఐ అప్పలరాజు తెలిపారు.

డొంకరాయి నుంచి దిగువకు నీటి విడుదల

మోతుగూడెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి దిగువకు నీటి విడుదల ఆదివారం కూడా కొనసాగిందని జెన్‌కో అధికార్లు తెలిపారు. జలాశయంలో నీటి మట్టం 1034.60 అడుగుల వద్ద స్థిరంగా కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో జలాశయం నీటి మట్టం 1034.60 అడుగులకు పెరగకుండా జలాశయం నుంచి దిగువకు 1000క్యూసెక్కుల నీటిని, అలాగే పొలూరు జల విద్యుత్ కేంద్రానికి పవర్ కెనాల్ ద్వారా మరో 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్న జెన్‌కో అధికారులు తెలిపారు.

వినాయకుని లడ్డూ రూ.30 వేలు

కొత్తపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పోలమ్మగుమ్మం సెంటర్లో 40వ గణేశ వార్షికోత్సవం సందర్భంగా నెలకొల్పిన వినాయకుని లడ్డూకు వేలం నిర్వహించారు. దుబాకుల బాబూరావు సన్స్ రూ.30వేలకు దక్కించుకున్నారు. శనివారం రాత్రి నిమజ్జనం అనంతరం పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.



స్టేట్ ర్యాంకర్లను అభినందిస్తున్న శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత శ్యామ్

'కృషి, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు'

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చని నగరానికి చెందిన శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్ అన్నారు. తమ వద్ద శిక్షణ తీసుకుని... కానిస్టేబుల్, డీఎస్సీ ఫలితాల్లో విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆదివారం సంస్థ తరపున సత్కరించారు. సివిల్ పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్‌గా నిలిచిన నానాజీని, మహిళా విభాగంలో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించిన రమ్యమాధురి, ఏపీఎస్పీ కానిస్టేబుల్ విభాగంలో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకు సాధించిన ఎం.అచ్చుతరావులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్లు శైలజ, సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు ఆలీ, మదీనా, శేఖర్, గణేష్, గోవర్ధన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూరియా పుష్కలం...
ఉనికిని కాపాడుకునేందుకే వైసీపీ రాద్ధాంతం

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



సామర్లకోట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో యూరియా కొరత సమస్యను ముందుగా గుర్తించి విదేశాల నుంచి రప్పించి రైతులకు అందుబాటులోకి తెచ్చి మేలు చేస్తున్నాం. అయితే కళ్లున్నా చూడలేని వైసీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేసేందుకు యూరియాను సాకుగా తీసుకుంటున్నారని' పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప నిశితంగా విమర్శించారు. ఆదివారం ఆయన సామర్లకోటలో విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు ఎన్నడూ రైతు సమస్యలపై స్పందించిన దాఖలాలు లేవన్న విషయాన్ని వారు ఇంకా మరిచిపోలేదన్నారు. అన్ని కేటగిరీల అధికారులు, సిబ్బందితో ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలూ కృషి చేస్తున్నారన్నారు. ప్రతి రైతుకూ యూరియా అందుబాటులో ఉంచేందుకు టోకెన్ పద్ధతిని అమలు చేస్తూ పారదర్శకంగా సరఫరా చేస్తున్నామన్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద సైతం యూరియా, ఎరువుల విక్రయాలను వీఆర్వోలు, వీఏఏలతో పర్యవేక్షిస్తూ సరఫరా చేస్తున్నామని ఎమ్మెల్యే రాజప్ప చెప్పారు.

జగన్... కళ్లు తెరిచి వాస్తవాలు చూడు

యూరియా పుష్కలంగా అందిస్తున్నాం

రైతులతో కలిసి పొలంలో యూరియా చల్లిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



గొల్లప్రోలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ అసత్య ప్రచారాలు మానుకుని కళ్లు తెరిచి వాస్తవాలు చూడాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ హితవు పలికారు. ఆదివారం ఆయన గొల్లప్రోలు శివారులోని పంట పొలాల్లోకి దిగి రైతులతో కలిసి యూరియా జల్లారు. రైతులతో యూరియా సరఫరాపై మాట్లాడారు. రాష్ట్రంలో ఎరువులు లేవంటూ వైసీపీ నేతలు ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నిరంతరం సమీక్ష జరుపుతూ రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా, అన్ని రకాల ఎరువులను ఎమ్మార్పీకే విక్రయిస్తోందని తెలిపారు. ఒక్క గొల్లప్రోలు మండలంలోనే ఆదివారం 101 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామని చెప్పారు. వైసీపీ నాయకులు ధర్నాలు అంటూ పోస్టర్లు ఆవిష్కరిస్తున్నారని.... వారు ఏ జిల్లాలో, ఎక్కడ ఏ నియోజకవర్గం, ఏ గ్రామంలో ఎరువులు దొరకట్లేదో చెప్పాలని సవాల్ విసిరారు. అక్కడికి పది నిమిషాల్లో ఎరువులు పంపుతామని తెలిపారు.

కార్యక్రమంలో టీడీపీ పట్టణ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండ్ర సుబ్బారావు, బస్సా సత్యనారాయణ, కడారి బాబ్జీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గాది రాజబాబు, శీరం మాణిక్యం, వెన్నా బాపిరాజు, కొత్తలంక వీరభద్రాచార్యులు, దొమ్మేటి మనోహర్, శౌర్య తదితరులు పాల్గొన్నారు.

సాగర తీరంలో నిమజ్జనాల సందడి

గణనాథులకు 'ఘన' వీడ్కోలు పలికిన భక్తులు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట బీచ్‌లో వినాయక నిమజ్జనాలు రెండోరోజైన ఆదివారం కోలాహలంగా సాగాయి. పాటలు, నృత్యాలు, డీజే సౌండ్లు, బాణసంచా కాలుస్తూ యువకులు హుషారుగా పాల్గొన్నారు. గణేశ నగర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అధికారులు విద్యుత్తు, భారీ క్రేన్లు ఏర్పాటుచేసి విగ్రహాలు సముద్రంలో నిమజ్జనమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రక్రియను ఎస్పీ బిందుమాధవ్ పర్యవేక్షించారు. ఆయనకు ఉత్సవ సమితి ప్రతినిధులు జ్ఞాపిక అందజేశారు. గజ ఈతగాళ్లను తీరంలో పహారా కాయించారు. కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, వాకలపూడి మెరైన్ సీఐ టి.రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులకు కమిటీ కో-ఆర్డినేటర్ రంబాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వై.మలకొండయ్య, దూసర్లపూడి రమణరాజు ప్రశంసాపత్రాలు అందించారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో నిలిపిన వినాయక విగ్రహాలను ఉదయం నుంచి ప్రత్యేక పూజల అనంతరం పీబీసీ, ఏలేరు కాలువల్లో నిమజ్జనం చేశారు. దాదాపు అన్ని ప్రాంతాల్లో నిమజ్జనాలు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

గ్రామాల్లో ప్రశాంతంగా యూరియా పంపిణీ


యూరియా బస్తాలను తీసుకెళ్తున్న రైతులు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో యూరియా పంపిణీ ఆదివారం ప్రశాంతంగా జరిగింది.. గతంలో చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో ఈసారి ముందుగా రైతులకు టోకెన్లు పంపిణీ చేసి అవి ఉన్న వారికే టైమ్ స్లాట్ ప్రకారం ఉదయం 7.30 గంటల నుంచి చేబ్రోలు, తాటిపర్తి, మల్లవరం, చినజగ్గంపేట, కొడవలి తదితర గ్రామాల్లో ప్రత్యేక బృందాల పర్యవేక్షణలో పంపిణీ చేశారు. ఒక్కరోజే 100 టన్నుల యూరియాను రైతులకు అందించారు. వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, వ్యవసాయాధికారి సత్యనారాయణ పంపిణీని పర్యవేక్షించారు.

'నాయీబ్రాహ్మణ వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణ కులానికి చెందిన వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని ధన్వంతరి నాయీబ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన బీసీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారికి వినతిపత్రం సమర్పించారు. అనాదిగా నాయీబ్రాహ్మణులు క్షౌర వృత్తి, వాయిద్యం, వైద్యం ద్వారా జీవనం సాగిస్తున్నారన్నారు. క్షౌరం, బ్యూటీషియన్ తమ సామాజికవర్గ వృత్తులని, అందువల్ల మహిళలు, యువతకు ప్రతి జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహించాలని కోరారు. నాయీబ్రాహ్మణ కులానికి చెందిన వారికి మాత్రమే బార్బర్ లైసెన్స్ మంజూరు చేయాలని కోరారు. బ్యాండ్ కళాకారులు సంగీత పరికరాలు కొనుగోలు చేసుకునేందుకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు.

డాక్టర్ 'అడ్డాల'కు సత్కారం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోగుల కృతజ్ఞతా దినోత్సవాన్ని అడబాల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్‌గా, సామాజిక సేవా కార్యకర్తగా రోగులు, నిరుపేదల కోసం గత 27 ఏళ్లుగా సామాజిక సేవలు అందిస్తున్న ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ అడ్డాల సత్యనారాయణను ట్రస్టు అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు సత్కరించారు. లయన్స్ క్లబ్ సభ్యులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్‌నాయుడు, గరికిపర్తి ఓంనమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.

పవన్ జీతం... అనాథ పిల్లలకు అండగా

42 మందికి రూ.2.10 లక్షలు అందజేత


అనాథ విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అండగా నిలుస్తున్నారు. వరుసగా ఐదో నెల వివిధ గ్రామాలు, పట్టణాల్లో ఉన్న 42 మంది పిల్లల సంరక్షకులకు ఆదివారం వారి గృహాలకు జనసేన క్రియాశీలక కార్యకర్తలు వెళ్లి అందజేశారు. ఒక్కొక్కరికి రూ.5వేలు వంతున పవన్ పంపిన చెక్కులను అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, గోదావరి ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ఆరోగ్య సమస్యలకు చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. పిఠాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పనిచేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్యే దొరబాబు తెలిపారు. ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పవన్ ఆదేశాలకు అనుగుణంగా వీరు గ్రామస్థాయిలో ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు వారధులుగా పని చేస్తారని చెప్పారు.

విద్యార్థులకు 'శ్రీయువసేన' చేయూత



శ్రీయువసేన సంస్థ నుంచి విద్యా సాయం పొందిన విద్యార్థినీ, విద్యార్థులు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామారావుపేట సుబ్బయ్య గ్రాండ్స్ సమావేశ హాలులో శ్రీయువసేన సేవా సంస్థ ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. అధ్యక్షత వహించిన శ్రీయువసేన అధ్యక్షుడు బొల్లం సతీష్ మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరంలో 90 మంది విద్యార్థుల చదువుల కోసం దాతల సహకారంతో రూ.25 లక్షలకుపైగా ఆయా స్కూల్సు, కాలేజీలకు చెల్లించామన్నారు. కాకి నాడ రూరల్ రేపూరు గ్రామానికి చెందిన 6 సంవత్సరాల గాది ఫణీంద్ర కిడ్నీ మార్పిడి వైద్యం నిమిత్తం సాయం చేయమని సతీష్ కోరగా రూ.1.50లక్షల వరకు సాయం అందించేందుకు దాతలు ముందుకొచ్చారు. దాతలు మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా శ్రీయువసేన ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న అధ్యక్షుడు సతీష్‌కు, వారి బృందానికి తమ పూర్తి సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం పలువురు విద్యార్థుల తల్లులు మాట్లాడుతూ ఇంటి పెద్ద దిక్కు కోల్పోయిన తమ పిల్లలను అదే స్కూల్స్‌లో చదివిస్తూ అండగా నిలుస్తున్న శ్రీయువసేన సంస్థ ప్రతినిధులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామన్నారు. అనంతరం కొంతమంది విద్యార్థులకు దాతలు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నున్న దొరబాబు, సత్తి సూర్యనారాయణరెడ్డి, ద్వారంపూడి వీరభద్రారెడ్డి, సోము స్వాతి, రాజ్‌కుమార్, తోట పృథ్వీరాజ్, డాక్టర్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

'కాకినాడ జిల్లాకు నాయకర్ పేరు పెట్టాలి'


రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు, మేధావులు, సామాజికవేత్తలు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మల్లాడి సత్యలింగం నాయకర్ కాకినాడ జిల్లా సాధనకై స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్ సమావేశ హాలులో ఆదివారం జిల్లావ్యాప్తంగా వివిధ సంఘాల నాయకులు, మేధావులు, సామాజికవేత్తలు, రాజకీయ ప్రముఖులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, విదేశీ విద్య అందించేందుకు తాను సంపాదించిన యావదాస్తినీ దానం చేసిన మహనీయుడు సత్యలింగం నాయకర్ అన్నారు. వంద సంవత్సరాల క్రితమే విద్య అవసరాన్ని గుర్తించి, విద్యతోనే పేదలు, బడుగు, బలహీనవర్గాలు అభివృద్ధి చెందుతాయన్న ముందుచూపుతో ఆలోచించి విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. అటువంటి నాయకర్ పేరును కాకినాడ జిల్లాకు పెట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులను, ప్రజాప్రతినిధులను కలుపుకుని కూటమి ప్రభుత్వం ద్వారా నాయకర్ కాకినాడ జిల్లా పేరు సాధనకు కృషి చేస్తామని సుమారు 40 సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. సమావేశంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, కాకినాడ సూపర్‌బజార్ చైర్మన్ ప్రెసింగి ఆదినారాయణ, నాయకులు నల్లం శ్రీనివాస్, భమిడిపాటి శ్రీకృష్ణ, గట్టి సత్యనారాయణ, జవహర్ ఆలీ, పెంకే శ్రీనివాసబాబా, పప్పు దుర్గారమేష్, పంపన రామకృష్ణ, బొబ్బిలి గోవిందు, దుగ్గన బాబ్జీ, గుత్తుల రమణ, నందమూరి వినోద్, బలగం ప్రసన్నకుమార్, కాశి బాలయ్య, బచ్చల కామేశ్వరరావు, సుందరపల్లి గోపాలకృష్ణ, మాకిరెడ్డి భాస్కర్‌గణేష్, బొల్లంగి వేణుగోపాల్, వనపర్తి బద్రి, రాయుడు నాగేశ్వరరావు, చొల్లంగి వీరబాబు, విశ్వనాథపల్లి శ్రీనివాసరాజు, పలివెల రవిఅనంతకుమార్, మేడపాటి రామారెడ్డి, మల్లాడి రాజు, జానపాముల నాగబాబు, కొక్కిలగడ్డ గంగరాజు, యాళ్ల పద్మలత, నాళం ఆండాళ్, నక్కిన విజయలక్ష్మి, తోలేటి శిరీష తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం

పిఠాపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీపాదుల దివ్య పాదపద్మాలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. దత్త హోమం, గోపూజ, పల్లకీ సేవ జరిగాయి. ఈవో సౌజన్య భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారికి వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ చండీ హోమం, ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. దేవస్థానం సహాయ కమిషనరు కె.వి జయలక్ష్మి, ఆలయ సిబ్బంది రమణ, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

కారు ఢీకొని తొమ్మిది గొర్రెలు మృతి

పెద్దాపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గొర్రెల మందను కంటికి రెప్పలా కాపాడుకుంటూ గొర్రెలకాపరి తిరిగి ఇంటికి చేరుకునే తరుణంలో ఓ కారు ఆ మందపైకి దూసుకెళ్లింది. దీంతో తొమ్మిది గొర్రెలు మరణించాయి. ఈ ఘటన కాకినాడ-రాజమహేంద్రవరం బైపాస్ రోడ్డులో లలిత పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండేపల్లి మండలం సూరంపాలేనికి చెందిన కోరికట్ల సుబ్బారావు తన గొర్రెల మందను మేతకు తీసుకెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న కారు గొర్రెల మందపైకి ఒక్కసారిగా దూసుకెళ్లడంతో తొమ్మిది గొర్రెలు మృత్యువాతపడ్డాయి. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇంటికి చేరుకునేలోపే ఇలా జరగడంతో వాటి యజమాని బోరున విలపించాడు. ఎస్ఐ మౌనిక సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.


మృత్యువాతపడ్డ గొర్రెలు

'ధ్యానంతో మానసిక, శారీరక శక్తి'



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మానసిక, శారీరక, సంపూర్ణ ఆరోగ్యం కోసం దైనందిన జీవితంలో ప్రకృతికి దగ్గరగా నడుచుకోవాలని ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం సర్పవరం ఆటోనగర్‌లోని డీజీబీ కన్వెన్షన్ హాల్లో బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి రజనీ దీదీ ఆధ్వర్యంలో 'సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రకృతి వైద్యం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సత్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రకృతి వైద్యం అనేది మానవ శరీరం, మనస్సు, ఆత్మ అనుసంధానంతో జరిగే చికిత్సా విధానమన్నారు. ధ్యానంతో మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందన్నారు. మనిషికి మానసిక శక్తి బాగుంటే దేన్నయినా సాధించవచ్చనే దానికి నిదర్శనం గాంధీజీ అన్నారు. కాకినాడ రూరల్, సిటీ ప్రాంతాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భూమి, ఉపాధి హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్‌గా చంగల్‌రావు


సమాలోచన సదస్సులో మాట్లాడుతున్న చంగల్‌రావు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యాన ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ, అభివృద్ధి, రక్షణ, భూమి, విద్య, ఉపాధి చట్టాలపై విజయవాడలో దళిత, గిరిజన, బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర సమాలోచన సదస్సు జరిగింది. భూమి, ఉపాధి హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్‌గా కాకినాడకు చెందిన డీబీఎఫ్ జాతీయ కో-ఆర్డినేటర్ తోటి చంగల్‌రావు నియమితులయ్యారు. డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయకుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శిలు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లివిల్సన్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణకుమార్, ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

కొబ్బరిచెట్ల నరికివేతపై ఉప్పంగల గ్రామస్తుల ఆందోళన

తాళ్లరేవు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉప్పంగల రామలింగేశ్వర దేవాలయంలో ఎటువంటి అనుమతి లేకుండా కొందరు పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ నీడనిచ్చే కొబ్బరి చెట్లను నరికివేయడంపై గ్రామస్తులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. వంగా త్రిమూర్తులు మాట్లాడుతూ దేవాలయంలో ప్రదక్షిణ చప్టా పేరుతో స్థానిక పంచాయతీ, ఎండోమెంట్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి లేకుండా ప్రజలెవ్వరికీ తెలియకుండా వైసీపీకి చెందిన ముగ్గురు వ్యక్తులు సమారు 11 కొబ్బరిచెట్లను నరికివేశారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గుత్తాల మహాలక్ష్మి, బాలకృష్ణ, ముడికి క్రాంతి, వంగా సత్తిబాబు, చిన వెంకటరమణ, సతీష్, శ్రీనివాస్, ఆదినారాయణ పాల్గొన్నారు.

సామర్లకోటలో మహాన్నదానం

సామర్లకోట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బళ్ల మార్కెట్ వద్ద గల గణపతి ఆలయం వద్ద కమిటీ ప్రతినిధులు ఆదివారం ఏర్పాటుచేసిన మహాన్నదానాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, టీడీపీ నాయకులు ప్రారంభించారు. కమిటీ ప్రతినిధులు పెద్దిరెడ్ల పెదకాపు, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో తొలుత గణపతికి జరిగిన విశేష గరిక పూజల్లో రంగనాగ్, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు శ్రీనివాసు పాల్గొన్నారు. సుమారు 5వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. పెదకాపు, సానిపిని హరిబాబు, అందుగుల జార్జిచక్ర వర్తి, కుప్పాల బాలాజీ బ్రదర్స్, కొర్లమండ వీరభద్రరావు, కిరణ్‌కుమార్, ఆకుల రామారావు, జనసేన నాయకుడు సరోజా వాసు తదితరులు పాల్గొన్నారు.


శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో పూజలు నిర్వహిస్తున్న మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి

ముగిసిన విజయనాంద తీర్థ స్వామి

చాతుర్మాస్య వ్రత దీక్ష

పిఠాపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ అనఘా దత్త క్షేత్రంలో మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థస్వామి నిర్వహిస్తున్న చాతుర్మాస్య వ్రత దీక్ష ఆదివారం సాయంత్రం ముగిసింది. 60రోజుల పాటు జరిగిన దీక్ష ముగింపు సందర్భంగా పవమాన హోమం, సీమోల్లంఘనము నిర్వహించారు. అనంతరం ఆయన విశాఖపట్నంలోని చింతామణి గణపతి క్షేత్రానికి బయల్దేరి వెళ్లారు. అంతకు ముందు పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానాన్ని సందర్శించి శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి కాలినడకన వెళ్లి మహా సంస్థానం, పాదగయ క్షేత్రం, కుంతీమాధవ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈవో సౌజన్య తదితరులు స్వాగతం పలికారు.


ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న స్వచ్ఛ గొల్లప్రోలు ప్రతినిధులు

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

గొల్లప్రోలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ స్లాబులు సవరించడం ద్వారా ప్రజలపై పడే భారాన్ని తగ్గించినందుకు గొల్లప్రోలులోని స్వామి వివేకానంద జ్ఞాన మందిరంలో ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి స్వచ్ఛ గొల్లప్రోలు ప్రతినిధులు పాలాభిషేకం చేశారు. కన్వీనర్ కొశిరెడ్డి రాజా, కర్రి కొండలరావు, కొమ్ము సత్యనారాయణ, కొశిరెడ్డి త్రిమూర్తులు, దర్శిపూడి విశ్వేశ్వరరావు, చోడపునీడి పుల్లపురాజు, భారతాల శేషారావు, కంకటాల శ్రీనివాసరావు, పడాల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ అండర్-23 పురుషుల జిల్లా జట్టు ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఏసీఏ నార్త్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యాచ్‌ల్లో పాల్గొనేందుకు అండర్-23 పురుషుల క్రికెట్ జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ నక్క వెంకటేష్ తెలిపారు. మ్యాచ్‌లన్నీ మల్టీ డేస్ (3డేస్) ఫార్మాట్‌లో జరుగుతాయని, టీమ్ కోచ్‌గా హకీం పాషా వ్యవహరిస్తారన్నారు.

సభ్యులు: బి.సుజన్ (కెప్టెన్), టీఏవీ సాయిశ్రవణ్ (వైస్‌కెప్టెన్), కె.సత్యసూర్య జయంతి, టి.మురళీకృష్ణ, కె.సనత్‌షణ్ముఖ్, పి.వంశీనారాయణ, బి.దినేష్‌శ్రీనివాస్, ఆర్.శశివదన్, ఐ.నాగేంద్రబాబు, యు.సందేష్, వి.గిరిప్రసాద్, జి.సూర్యదీలీప్, పీఎస్ఎస్ మౌళి, జేఎస్ఎస్ హర్షవర్ధన్, కె.మంజునాథ్.


చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కొత్తపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పాడ నుంచి నలుగురికి, అమీనబాద్ నుంచి ఇద్దరికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.4లక్షలు మంజూరైంది. ఈ మొత్తాలను వారికి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆదివారం అందజేశారు. పలువురు మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

రేపు 'అన్నదాత పోరు'

పిఠాపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ మంగళవారం నిర్వహించే 'అన్నదాత పోరు'ను విజయవంతం చేయాలని కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ కోరారు. సంబంధిత పోస్టర్లను ఆదివారం ఆమె వైసీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

గొల్లప్రోలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ స్లాబులు సవరించడం ద్వారా ప్రజలపై పడే భారాన్ని తగ్గించినందుకు గొల్లప్రోలులోని స్వామి వివేకానంద జ్ఞాన మందిరం లో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి స్వచ్ఛ గొల్లప్రోలు ప్రతినిధులు పాలాభిషేకం చేశారు. కన్వీనర్ కొశిరెడ్డి రాజా, కర్రి కొండలరావు, కొమ్ము సత్యనారాయణ, కొశిరెడ్డి త్రిమూర్తులు, దర్శిపూడి విశ్వేశ్వరరావు, చోడపునీడి పుల్లపు రాజు, భారతాల శేషారావు, కంకటాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రూ.3కోట్ల 60లక్షలతో డ్రైనేజీల ఏర్పాటు

● ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



రంపచోడవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రంపచోడ వరం పంచాయతీ పరిధిలో రూ.3కోట్ల 60లక్షల వ్యయంతో ఉపాధి హామీ పథకంద్వారా సీసీ డ్రైనేజీలు ఏర్పాటుచేస్తామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ అంబేడ్కర్ సెంట ర్-మారేడుమిల్లి రోడ్, సబ్‌కలెక్టర్ కార్యాలయం మీదుగా సీసీ డ్రైనేజ్ నిర్మించనున్నట్టు తెలిపారు. రంపచోడవరంలో రోడ్డు వెడల్పులో భాగంగా కోల్పోయిన గిరిజనులకు షాపులు ఏర్పా టుచేసే విధంగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు నివేదించా మన్నారు. స్పెషల్ మైనర్ ఇరిగేషన్‌ద్వారా ఏజెన్సీలో 4,600 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 11పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా 6,640 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రూ.3.90 కోట్ల అంచనా వ్యయంతో 18 పనుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించినట్టు పేర్కొ న్నారు.

అందుబాటులో 30 మెట్రిక్ టన్నుల యూరియా

● ఏవో చక్రధర్



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో చక్రధర్

రాజవొమ్మంగి సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి మండల రైతులకు 30మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని రాజవొమ్మంగి వ్యవసాయశాఖ అధికారి చక్రధర్ తెలిపారు. ఆదివారం జడ్డంగి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో చక్రధర్ మాట్లాడుతూ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి ఇండెంట్‌లు సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే రైతుల సిఫార్స్‌మేర మాత్రమే ఎరువులు వేసుకోవాలన్నారు. తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎస్‌ఐ చిన్నబాబు, సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న నాయకులు

అడ్డతీగల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవంలో భాగంగా ఆదివారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్కార సభ ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా, డివిజన్, మండలాల్లోని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని దుస్సాలువాలతో సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎంపీడీవో శ్రీమతి విజయ ఏజన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, ఎంఈవోలు కె.రమేష్, పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఉపాధ్యాయులు పా ల్గొన్నారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన యూటీఎఫ్ నాయకులకు ఉపాధ్యాయులు ధన్య వాదాలు తెలిపారు.

ఘనంగా అన్నసమారాధన

వై.రామవరం, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి):వై.రామవరంలో నాగమ్మ అమ్మవారి గుడిలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటుచేసిన ఈ అన్నసమారాధన కార్యక్రమానికి అధికసంఖ్యలో భక్తులు హాజరై అన్నప్రసాదాలను స్వీకరించారు.

ఎన్నాళ్లు ఈ పెండింగ్


● ఆర్అండ్ఆర్ పరిహారం అందేనా? ● అధికారుల నిర్లక్ష్యంతో జాప్యం

కూనవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కూనవరం మండలంలో తొమ్మిది గ్రామాలను ప్రాధాన్య గ్రామాలుగా గుర్తిస్తూ పోలవరం ముంపు జాబితాలో చేర్చారు. అందులో కూనవరం పంచాయతీ ఒకటి. ఏడాదిగా ఇక్కడ ప్రజల నుంచి అధికారులు ధ్రువీకరణ పత్రాలు స్వీకరిస్తూనే ఉన్నారు. గ్రామసభలు పెట్టిన ప్రతీసారీ ఆధార్, రేషన్‌కార్డు, ఇంటి పన్ను తదితర అర్హత పత్రాలు నిర్వాసితులు అందిస్తున్నారు. అయితే అందించిన ప్రతీసారీ స్వీకరిస్తూనే ఉన్న అధికారులు అవి మిస్ అయ్యాయంటూ మళ్లీ మళ్లీ ఇవ్వాలంటూ నిర్వాసితులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇక్కడ ప్రజలు అంటున్నారు. ఇప్పటికే నాలుగుసార్లకుపైగా అర్హత పత్రాలను జిరాక్స్ రూపంలో ఇచ్చామని మళ్లీ ఇవ్వాలంటూ తమను పెండింగ్ జాబితాలో చేర్చారని టేకులబోరు గ్రామస్థులు అంటున్నారు. తాజాగా ఆర్అండ్ఆర్ కోసం టేకులబోరు గ్రామానికి చెందిన 87మందిని పెండింగ్ జాబితాలో చేర్చడంతో వారు జిరాక్స్ పత్రాలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఆదివారం సెలవు అయినప్పటికీ అధికారులు ఆ పత్రాలను తీసుకున్నారు. ఒకవైపు ఆర్అండ్ ఆర్ పరిహారం అందించేందుకు ప్రభుత్వం శరవేగంగా పావులు కదుపుతుంది. సాధ్యమైనంత త్వరలో ప్రాధాన్య గ్రామాలకు ఆర్అండ్ఆర్ పరిహారం అందజేయనున్నారు. అయితే పోలవరం అధికారులు ఇటువంటి నిర్లక్ష్యం కారణంగా కొంత జాప్యం జరుగుతుంది.

గోతులమయంగా పాలగడ్డ-సీలేరు రోడ్డు

● వాహనదారుల నరకయాతన ● పట్టించుకోని అధికారులు

మోతుగూడెం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొన్ని సంవత్స రాల నుంచి బొడ్డగండి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పాలగడ్డ గ్రామం నుంచి సీలేరు వెళ్లే రాష్ట్ర రహదారి పూర్తిగా దెబ్బతిన్న ఆర్అండ్‌బీ శాఖ ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఒక్క సర్వేకు మాత్రమే పరిమితమైంది. ఇదే రాష్ట్ర రహదారిపై విశాఖపట్నం నుంచి భద్రాచలం వెళ్లే బస్సులు, విజయవాడ నుంచి సీలేరు వచ్చే బస్సులు, రాజమహేంద్రవరం నుంచి సీలేరు వెళ్లే బస్సులు, పాడేరు నుంచి భద్రాచలం వెళ్లే బస్సులు తిరుగుతూ ఉన్నా ఈ రహదారిని పట్టించుకునే ప్రభుత్వ వ్య వస్థలు కనుమరుగయ్యాయి. డొంకరాయి, సీలేరు, ధారకొండ వంటి గ్రామాలు టూరిస్ట్ ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతూ పర్యాటకులకు ఆకర్షణలుగా నిలుస్తున్నా, ఇక్కడికి వచ్చే పర్యా టకులకు మాత్రం ఈ రోడ్డు ఆటంకంగా మారింది. టీడీపీ ప్రభుత్వం వచ్చి సంవత్సరంపైనే అవుతున్నా, సీఎం నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఎక్కడా గోతులులేని రహదారులు చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఇప్పటివరకు ఈ రోడ్డును పట్టించుకునే పరిస్థితి లేదు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక కొత్త బీటీ రోడ్ వేయాలని ఆర్అండ్‌బీశాఖ సర్వే చేసింది. కానీ ఇప్పటివరకు ఈ రోడ్డుకి మరమ్మతులు కూడా చేయలేకపోయింది. ఈ రోడ్డువల్ల స్థానిక ప్రజలు చాలా ఇబ్బ ందులకు గురవుతున్నారు. వర్షాకాలంవస్తే రోడ్డుపై పడిన గుంతలకు వాహనాలు ఎటునుంచి నడపాలో తెలియని అ యోమయం పరిస్థితిలో ఉంటూ, అయోమయానికి గురవుతున్నారు. వర్షాకాలంలో ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతలు చెరువులను తలపిస్తున్నాయి. ఈరోడ్డు బాగుచేయాలని ప్రజా ప్రతినిధులు సైతం అధికారులను విన్నవించుకున్నా, ఎటువం టి ప్రయోజనం లభించలేదు. ఇప్పటికైనా ఈ రోడ్డుని బాగు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



పాలగడ్డ-సీలేరు రోడ్డులో కారుతో వెళ్లడానికి ఇబ్బంది పడుతున్న దృశ్యం

పోలవరం కాలువ మట్టి అక్రమ తరలింపు

● కాసుల కక్కుర్తిలో అధికారులు
● ఇటుక బట్టీలు, లేఅవుట్లకు తరలింపు
● అక్రమార్కుల బరితెగింపు



పెద్దనాపల్లిలో పోలవరం మట్టిని టిప్పర్లతో తరలిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెద్దనాపల్లి గ్రామ పరిధి పోలవరం కాలువ సమీపంలో వేసిన గట్టున ఉన్న మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకుండానే రహస్యంగా తవ్వకాలు చేపట్టడంపై పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టిని తవ్వేసి ఇటుక బట్టీలకు తరలించి అనధికారికంగా అక్రమార్కులు టిప్పర్ మట్టి రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నారు. పగలూ రాత్రి తేడా లేకుండా జేసీబీ సాయంతో బహిరంగంగా టిప్పర్లతో ఇటుక బట్టీలకు, లేఅవుట్లకు ఇతర మండలాలకు తరలిస్తున్నప్పటికీ అధికారులు కాసులకు కక్కుర్తిపడి చోద్యం చూస్తున్నారని పలు విమర్శలు వస్తున్నాయి.

మట్టి తవ్వకంతో కాలువకు ప్రమాదం: పోలవరం కాలువను ఆనుకుని ఉన్న గట్లు తవ్వేయడంతో భవిష్యత్‌లో నీరు ప్రవహించే సందర్భాల్లో గట్టు ఉంటేనే కాలువ పటిష్ఠంగా ఉంటుంది. లేని పక్షంలో గండ్లు పడి స్థానిక గ్రామాలు ముంపుకు గురయ్యే అవకాశముంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న పోలవరంలోని ప్రతీ విభాగాన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు.. గట్లును తవ్వేస్తున్నా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇకనైనా పోలవరం, రెవెన్యూ అధికారులు మట్టి అక్రమ తరలింపును నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భారీ వాహనాల తాకిడితో రహదారులు ధ్వంసమవుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ తుని-పెద్దాపురం కోఆర్డినేటర్‌గా వాసిరెడ్డి

రౌతులపూడి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ తుని-పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా రౌతులపూడి గ్రామానికి చెందిన వాసిరెడ్డి జగన్నాథం(జేమీలు) నియమితులయ్యారు. ఆదివారం పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోల్లు చినదివాణం, కేదారశెట్టి నాగేశ్వరరావు, పోలుపర్తి తాతాజీ, సర్పం శ్రీను, చింతకాయల సత్యనారాయణ, గోల్లు వెంకటరమణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ముదునూరికి నాయకుల సంఘీభావం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో వైసీపీ నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజును ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా వైసీపీ నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు. వైసీపీ పాలకొల్లు నియోజకవర్గ కోఆర్డినేటర్ గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి), రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు, కాకినాడ జిల్లా మహిళా విభాగం ఇన్‌చార్జ్ కర్రి జయచరిత తదితరులు వచ్చి మురళీకృష్ణంరాజుకు సంఘీభావం తెలిపారు. అనంతరం మురళీరాజు తండ్రి రామరాజును పరామర్శించారు. కూటమి ప్రభుత్వం రామరాజుపై అక్రమ కేసు పెట్టడం దారుణమన్నారు.

క్రికెట్ అండర్-23 పురుషుల జిల్లా జట్టు ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఏసీఏ నార్త్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యాచ్‌ల్లో పాల్గొనేందుకు అండర్-23 పురుషుల క్రికెట్ జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ నక్క వెంకటేష్ తెలిపారు. మ్యాచ్‌లన్నీ మల్టీ డేస్ (3డేస్) ఫార్మాట్‌లో జరుగుతాయని, టీమ్ కోచ్‌గా హాకీం పాషా వ్యవహరిస్తారన్నారు.

సభ్యులు: బి.సుజన్ (కెప్టెన్), టీపీవీ సాయిశ్రవణ్ (వైస్ కెప్టెన్), కె.సత్యసూర్య జయంతి, టి.మురళీకృష్ణ, కె.సనత్‌షణ్ముఖ్, పి.వంశీనారాయణ, బి.దినేష్‌శ్రీనివాస్, ఆర్.శశివదన్, ఐ.నాగేంద్ర బాబు, యు.సందేష్, వి.గిరిప్రసాద్, జి.సూర్యదిలీప్, పీఎస్ఎస్ మౌళి, జేఎస్ఎస్ హర్షవర్ధన్, కె.మంజునాథ్.

వైభవంగా చండీ హోమం

పిఠాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీహోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీపాదుల దివ్య పాదపద్మాలకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.దత్త హోమం, గోపూజ, పల్లకీ సేవ జరిగాయి. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనాలు



ప్రత్తిపాడులో గణేష్ నిమజ్జన ఊరేగింపులో ఇందిరా కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ మహిళలు



ఏలేశ్వరంలో గణనాథుడిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలో గణేష్ నిమజ్జనోత్సవాలు ఆదివా రం ఘనంగా ముగిశాయి. ఆదివారం రాత్రి చంద్రగ్రహణం దృష్ట్యా మండల వ్యాప్తంగా వినాయక మండపాల్లో ఉన్న వినాయక విగ్రహాలను బాణసంచా కాల్పులు, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగించి కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. ప్రత్తిపాడు ఇందిరాకాలనీ మహిళలు గణేష్ నిమజ్జనంలో పాల్గొని సందడి చేశారు. అలాగే గ్రామంలో నాలుగు చోట్ల మం డపాల్లోని గణనాథులను వాహనాలపై ఊరేగించి స్థానిక పుష్కర కాలువలో నిమజ్జనం చేశారు.

ఏలేశ్వరం,(ఆంధ్రజ్యోతి): గణేష్‌నవరాత్రుల ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం ఏలేరు నదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. పట్టణంలో పల్లపువీధి, సుబ్బయ్యమ్మపేట, చైతన్య నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహాలను తీన్‌మార్, బ్యాండ్ మేళాలు, డీజేలు, బాణసంచాలతో నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. ఎటువంటి ప్రమాదాలకు తావు లేకుండా నది వద్ద ఎస్ఐ రామలింగేశ్వరరావు పోలీసు బందోబస్తు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.

రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి సేవలో దత్తస్వామి



ఆలయంలో అరుణాచలేశ్వరునికి పూజలు చేస్తున్న దత్త విజయానంద తీర్థ స్వామిజీ

ప్రత్తిపాడు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): రాచపల్లి గ్రామానికి చెందిన అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర ఆలయాన్ని అవదూత, దత్తపీఠ ఉత్తరాధిపతి, దత్త విజయానంద తీర్థ స్వామిజీ సందర్శించారు. ఆదివారంఅరుణాచలేశ్వర దేవస్థానానికి విచ్చేసిన స్వామిజీకి ఆలయ వ్యవస్థాపకుడు రమణానంద స్వామి, వేదపండితులు, ఆలయ ప్రధానార్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివార్ని దత్త స్వామి దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అపీత కుంచాంబ అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. అరుణాచల క్షేత్రం మహా పుణ్యక్షేత్రమని, తమిళనాడులోని అరుణాచల ఆలయం మాదిరిగా పోలి ఉన్న ఇక్కడి అరుణాచల దేవస్థానం మహిమాన్విత క్షేత్రంగా బాసిల్లుతుందని చెప్పారు. అనంతరం అమ్మవారికి మహిళా భక్తులు కుంకుమార్చనలు, పారాయణాలు నిర్వహించారు. కాళభైరవ విగ్రహానికి ఆలయ ప్రధానార్చకులు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఎల్.తాతాజీ, దేవి, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల మూసివేత



రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి ఆలయాన్ని మూసివేసిన దృశ్యం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా మండలంలోని ఆలయాలను ఆదివారం సాయంత్రం మూసివేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రంగా బాసిల్లుతుతున్న రాచపల్లి అపీత కుచాంబ దేవస్థానాన్ని మధ్యాహ్నం 3గంటలకు మూసివేశారు. ఉత్తరకంచిలో వెంకటేశ్వరస్వామి, ధర్మవరంలో రాజరాజేశ్వరి విశ్వేశ్వరస్వామి, ప్రత్తిపాడులో అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి, ఒమ్మంగిలో స్వయంభూ ఉమా రామలింగేశ్వర స్వామి, ప్రత్తిపాడు తోటవీధిలోని షిరిడిసాయిబాబా, వేణుగోపాల స్వామి ఆలయాలను మూసివేశారు. సోమవారం వేకువజామున సంప్రోక్షణ చేసి ఆలయాలను తెరుస్తామని ఆలయాల అర్చకులు తెలిపారు.

ఎరువుల సరఫరాలో వైఫల్యం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ఈనెల9న వైసీపీ ఆధ్వర్యంలో పెద్దాపురంలో నిర్వహించే అన్నదాత పోరు పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మి శివకుమారి, గిరిబాబు ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ యూరియా కొరత ఉన్నప్పటికీ అధికారులతో యూరియా అందుబాటులో ఉందని చెప్పించడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో రౌతు స్వామి, బొల్లు దివానం, చిడగం వెంకటేశ్వరరావు, కాకి నాని, రామిశెట్టి నాని, నరాల శ్రీను, గొల్లపల్లి కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

రౌతులపూడి,సెప్టెంబరు7(ఆంధ్ర జ్యోతి): మల్లంపేటలో ఆదివారం అన్నస మారాధన నిర్వహించారు. వినాయకుడి నిమజ్జనం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. రౌతుల పూడిలో శివాలయం వద్ద వినాయకుడి నిమజ్జనం నిర్వహించారు.

గంగమ్మకు పూజలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పెద్దిపాలెం గ్రామదేవత గంగమ్మ తల్లికి ఆదివారం భక్తులు విశిష్ట పూజలు నిర్వహించారు. బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలతో భక్తులు ఆలయానికి పెద్ద ఎత్తున వెళ్లి అమ్మవారికి పూజలు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వచ్చే గంధ అమావాస్యకు ఈ ఆలయం వద్ద గావు సంబరం నిర్వహించాలని నిర్ణయించారు.

కిర్లంపూడిలో చిరుజల్లులు

కిర్లంపూడి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆకాశం మేఘావృతమై రాజుపాలెం, కిర్లంపూడి పరిసర గ్రామాల్లో చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఎండలు కాయడం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం చల్లబడి వర్షం కురవడంతో ప్రజలు సేదతీరారు.



రథసేవలో పాల్గొన్న పండితులు, భక్తులు

సత్యదేవుడికి ఘనంగా రథోత్సవం

అన్నవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జిత సేవైన రథసేవ ఆదివారం వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను రథంపై ఆసీనులు గావించి ప్రత్యేక పూజలు అనంతరం తూర్పురాజగోపురం చుట్టూ భక్తుల గోవిందనామ స్మరణలు, పండితుల వేదమంత్రాల మధ్య ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.



పూర్ణాహుతి జరుపుతున్న పండితులు

వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిరి హోమం

అన్నవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహ వచనం అనంతరం ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి పారాయణలు, జపములు నిర్వహించగా 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.



నిరుద్యోగ యువతనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివ్య

జాబ్‌మేళాకు విశేష స్పందన

తునిరూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య నియోజకవర్గంలో మూడోసారి జాబ్‌మేళా నిర్వహించారు. ఆదివారం తుని బాలికల ఉన్నత పాఠశాలలో జాబ్‌మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి నిరుద్యోగ యువతతో మాట్లాడారు. అనంతరం పరిశ్రమల స్థాపన, ప్రభుత్వ ప్రోత్సాహాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించి యువత వ్యాపార ఉద్యోగ రంగంలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చింతమనీడి అబ్బాయి, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, వెలగా వెంకటకృష్ణారావు, కుసుమంచి శోభారాణి, తమరాన సత్యనారాయణ, ఇనిగంటి సత్యనారాయణ, రొంగల అబ్బు, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు తమరాన వరలక్ష్మి, ఆవుగడ్డి వెంకటరమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



లోవలో ఆలయం తలుపులు మూసివేస్తున్న పండితులు



కిర్లంపూడిలో మూసివేసిన శివాలయం

చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత

తునిరూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం నేపథ్యంలో లోవ ఆలయాన్ని సిబ్బంది మూసివేశారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ తలుపులు మూసివేసిన పండితులు చంద్రగ్రహణం ముగిసిన తర్వాత ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆలయ పండితులు శర్మ తెలిపారు.

జగ్గంపేట/కిర్లంపూడి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆదివారం పూర్తి చంద్రగ్రహణం రావడంతో సాయంత్రం ఆలయాలు మూసివేశారు. జగ్గంపేట లో శివాలయం, వేంకటేశ్వర స్వామి ఆలయం, విష్ణు ఆలయంతో పాటు పలు ఆలయాలను మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం ఆలయాలు తెరుస్తామని అర్చకులు తెలియజేశారు. కిర్లంపూడిలో శివాలయంతో పలు ఆలయాలు మూసివేశారు.

యనమలను కలిసిన మత్స్యకార సంఘం నాయకులు

తునిరూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని పలువురు మత్స్యకార పెద్దలు, నాయకులు తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో కలిశారు. కాకినాడ జిల్లాకు సత్యలింగ నాయకర్ పేరు పెట్టాలని, తమ నినాదాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. యనమల మాట్లాడుతూ మత్స్యకారులు చేస్తున్న డిమాండ్‌ను పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరతానని యనమల హామీ ఇచ్చారు.



యనమలకు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార సంఘ నాయకులు

ముగిసిన గణనాథుని నిమజ్జనోత్సవాలు

జగ్గంపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంతోపాటు పట్టణంలో ఆదివారం నాడు వినాయక నిమజ్జనాలను ఘనంగా పూర్తి చేశారు. జగ్గంపేటలో రాత్రి 12 గంటల వరకు కూడా నిమజ్జనాలు జరిగాయి. సీఐ వైఆర్‌కె శ్రీనివాసరావు, ఎస్ఐ రఘునందన్ రావు ఆధ్వర్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండేపల్లి, సింగరంపాలెం, రామయమ్మపాలెం, మల్లేపల్లిలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, ఏఈ కిరణ్ కిషోర్ తెలిపారు. నూతన సబ్ స్టేషన్ నిర్మాణ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

జగ్గంపేటలో వీధి కుక్కల బెడద

జగ్గంపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో వీధి కుక్కలు బెడద ఎక్కువైంది. ఆయా వార్డుల్లో విచ్చలవిడిగా పెరిగిపోయిన కుక్కల వల్ల భయాందోళన చెందుతున్నామని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రాత్రిళ్లు సమయంలో వాహదారుల వెంట పడి దాడి చేస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కుక్కల బెడద చూడాలని ఆయా వార్డు ప్రజలు కోరుతున్నారు.

'ధ్యానంతో మానసిక,శారీరక శక్తి'

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మానసిక, శారీరక, సంపూర్ణ ఆరోగ్యం కోసం దైనందిన జీవితంలో ప్రకృతికి దగ్గరగా నడుచుకోవాలని ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం సర్పవరం ఆటోనగర్‌లోని డీజీబీ కన్వెన్షన్ హాల్లో బ్రహ్మ కుమారీస్ ఇన్‌చార్జి రజనీ దీదీ ఆధ్వర్యంలో సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రకృతి వైద్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ప్రకృతి వైద్యం అనేది మానవ శరీరం, మనస్సు, ఆత్మ అనుసంధానంతో జరిగే చికిత్సా విధానమన్నారు. ధ్యానంతో మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందన్నారు. మనిషికి మానసిక శక్తి బాగుంటే దేన్నయినా సాధించ వచ్చనే దానికి నిదర్శనం గాంధీజీ అన్నారు. కాకినాడ రూరల్, సిటీ ప్రాంతాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.